



RNI No. TGTEL/26/A1458

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




కె. అబెడ్నెగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 1 సంచిక : 13 అమీర్‌పేట్ ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 22 ఏప్రియల్ 2026 పేజీలు : 4 వెల : 2/-


దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని

## ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

**కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన**

**ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన**

**ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా సంస్థలు రాష్ట్రంలో త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అన్నారు.



ఉగ్రవాదానికి

## భారత్ తలొగ్గదు

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాదైంది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ.. 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. పహల్గామ్‌లో ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని కలచివేసిందని మోదీ అన్నారు. ఈ విషాదాన్ని, ఇందులో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఆ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని సానుభూతి వ్యక్తం

మిగతా .. 2లో..

ప్రధాని మోదీపై వ్యాఖ్యలు..

## ఖర్గేకు ఈసీ నోటీసులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోదీ ఉగ్రవాది అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై

మిగతా .. 2లో..

తెలంగాణాలో ఆరుగురు ఐపీఎస్‌లకు

## డైరెక్టర్ జనరల్ హోదా

- పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- డీజీగా పదోన్నతి పొందినవారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సజ్జనార్
- లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్



**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందినవారిలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారుసిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు. మహేశ్ భగవత్ ప్రస్తుతం

మిగతా .. 2లో..

హైదరాబాద్‌లో అద్దె బస్సులను

## నడుపుతోన్న ఆర్టీసీ

డాక్టర్ రాయపాటి శైలజ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.

ప్రకాశ్ రాజ్‌ను ఎవరైనా

## చంపితే ఏ1గా ఉంటా

**శ్రీరాముడిపై వ్యాఖ్యల నేపథ్యంలో ప్రకాశ్ రాజ్‌పై బీజేపీ నేత తీవ్ర హెచ్చరికలు**

**ప్రకాశ్ రాజ్‌ను ఎవరైనా చంపితే ఏ1 ముద్దాయిగా తాను సిద్ధమన్న వనిపల్లి శ్రీనివాస్**

**ఆయన ఒక అర్బన్ నక్సలైట్.. తుకుడే గ్యాంగ్ సభ్యుడని ఆరోపణలు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నటుడు ప్రకాశ్ రాజ్‌పై రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రకాశ్ రాజ్‌ను ఎవరైనా హత్య చేస్తే, ఆ కేసుకు తానే ఏ1 ముద్దాయిగా ఉంటానని, పూర్తి బాధ్యత

మిగతా .. 2లో..

## భారత్ జోలికి వస్తే..

**పాక్‌కు రాజ్‌నాథ్‌సింగ్ వార్నింగ్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** పహల్గాం ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈక్రమంలోనే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. జర్మనీలో ఏర్పాటు చేసిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ

మిగతా .. 2లో..

బీజేపీలోకి వెళ్తారన్న ప్రచారంపై

## స్పందించిన జీవన్‌రెడ్డి

**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే బీజేపీలో చేరతారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం**

**ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్న జీవన్ రెడ్డి**

**నా రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ సీనియర్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి బీజేపీలోకి చేరతారని కొన్నిరోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోందని, ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి తనపై కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన కంఠంలో

మిగతా .. 2లో..

బీజేపీ-బీఆర్ఎస్ మధ్య

## రహస్య ఒప్పందం

**కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు సాంకేతికపరమైన అంశాలకే పరిమితమన్న మహేశ్ గౌడ్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పు కేవలం సాంకేతికపరమైన అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా

మిగతా .. 2లో..

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పు ద్వారా

## కాంగ్రెస్ కుట్రలు కూలిపోతాయి



**కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పు.. స్పందించిన కేటీఆర్**

**హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు గెలిచారన్న కేటీఆర్**

**భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని వ్యాఖ్య**

**కాళేవ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించేలా హైకోర్టు తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై

మిగతా .. 2లో..

## హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి



**పీసీ ఘోష్ కమిషన్ ను హైకోర్టు తప్పుబట్టలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని వ్యాఖ్య**

**కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించిందన్న మంత్రి**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న కేసీఆర్, హరీశ్ రావు, కొందరు అధికారులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ

మిగతా .. 2లో..

ఇరాన్‌తో మలివిడత శాంతి చర్చలపై

## డొనాల్డ్ ట్రంప్ అప్‌డేట్



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్‌తో జరగనున్న మలివిడత శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. ఈరోజుతో (బుధవారం) అమెరికా- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ముగియాల్సి ఉన్నప్పటికీ.. రెండు రోజుల క్రితమే శాంతి చర్చలకు ఇరాన్‌కు మరింత

మిగతా .. 2లో..

హర్మూజ్ జలసంధిలో

## నౌకలపై ఇరాన్ దాడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించిన కొన్ని గంటలకే కీలక పరిణామం చోటుచేసుకొంది. హర్మూజ్ జలసంధిలో రెండు నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో ఓ కంటైనర్ నౌక దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హర్మూజ్ జలసంధిలో ఓ కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ పేర్కొంది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో నౌకకు నష్టం వాటిల్లిందని, ఇందులో ఎవరికీ గాయాలు కాలేదని స్పష్టంచేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే.. ఒక రవాణా నౌకపై కూడా

మిగతా .. 2లో..

పహల్గాం ఘటన తర్వాత

## పాక్- హమాస్ మధ్య బలపడిన సంబంధాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత హమాస్- పాక్ ఉగ్రవాదుల మధ్య సంబంధాలు బలపడినట్టు తెలుస్తోంది. పహల్గాం ఘటన కూడా హమాస్ అమలు చేసే ప్రణాళికలు, శైలిలోనే జరిగినట్టు కేంద్ర దర్యాప్తు బృందం పేర్కొంది. గతేడాది ఏప్రిల్ నుంచి పాక్ ఉగ్ర బృందాలు హమాస్‌తో ఇప్పటివరకు కనీసం నాలుగుసార్లు సమావేశమైనట్టు వెల్లడించింది. ఆ సమావేశాలు రహస్యంగా వివిధ ప్రాంతాల్లో జరిగినట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. పాకిస్థాన్ ఆక్రమిత్ కశ్మీర్, పాక్ నగరాల్లో, బంగ్లాదేశ్‌లో హమాస్- పాక్ ఉగ్ర బృందాలు సమావేశమైనట్టు దర్యాప్తులో తేలింది. ఈ సమావేశాల్లో లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్

మిగతా .. 2లో..

తమిళ పోరుకు

## సర్వం సిద్ధం..

**పోలీసు పహారాలో రాష్ట్రం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్‌పీఏ), ఎలాగైనా అధికారాన్ని

మిగతా .. 2లో..

## (మొదటిపేజీ తరువాయి)

తెలంగాణాలో ఆరుగురు ఐపీఎస్‌లకు

## డైరెక్టర్ జనరల్ హోదా

లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉండగా, స్వాతి లక్రా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్నారు. వీవీ శ్రీనివాసరావు తెలంగాణ పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్నారు. సీఐడీ, మహిళా భద్రతా విభాగం, ఏసీబీ ఏడీజీగా చారు సిన్హా విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ గ్రేహౌండ్స్ ఏడీజీగా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ప్రస్తుతం వీసీ సజ్జనార్ ఉన్నారు.

బీజేపీ-బీఆర్ఎస్ మధ్య

## రహస్య ఒప్పందం

చెప్పలేదని స్పష్టం చేశారు. కోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ తప్పుబట్టలేదని... కేవలం నివేదిక రూపకల్పనలో అనుసరించిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించిందని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని, బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నేతలు కాళేశ్వరంను 'ఏటీఎం'తో పోల్చారని గుర్తు చేస్తూ... కాళేశ్వరం అంశంపై ఇప్పుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం వల్లే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు.

ప్రకాశ్ రాజ్‌ను ఎవరైనా

## చంపితే ఏ1గా ఉంటా

తనదేనని శ్రీనివాస్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. శ్రీరాముడిపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆయన ఈ వివాదాస్పద హెచ్చరికలు జారీ చేశారు. రామాయణం, శ్రీరాముడిపై ప్రకాశ్ రాజ్ ఇటీవల చేసిన వ్యంగ్యాస్త్రాలే ఈ వివాదానికి దారితీశాయి. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన రాముడు, లక్ష్మణుడు అడవిలో పండ్లు తింటే జీఎస్టీ కట్టాలా అని, 'వన్ నేషన్ వన్ రిలీజియన్' అంటూ ప్రకాష్ రాజ్ ఎగతాళి చేశారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీని విమర్శించే క్రమంలో హిందూ దేవుళ్లను అవమానించడం సహించరాని నేరమని ఆయన పేర్కొన్నారు. నాస్తికుడినని చెప్పుకునే ప్రకాశ్ రాజ్, కేవలం హిందూ మతాన్ని, సనాతన ధర్మాన్ని మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్‌ను 'అర్బన్ నక్సలైట్' అని, 'తుకుడే గ్యాంగ్' సభ్యుడని శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా అభివర్ణించారు. ఢిల్లీలోని జేఎన్‌యూలో దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వారికి, బీఫ్ ఫెస్టివల్స్ నిర్వహించిన వారికి ప్రకాశ్ రాజ్ మద్దతు పలికిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దక్షిణ భారతీయుడినని చెప్పుకుంటూనే శ్రీరాముడిపై జోకులు వేయడం ప్రకాశ్ రాజ్ పైశాచిక ఆనందానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇంతటితో ఆగకుండా ప్రకాశ్ రాజ్ షూటింగ్ ఎక్కడ జరిగినా అడ్డుకుంటామని శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఆయన టూర్ డైరీని అనుసరిస్తామని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే వెంటాడి, వేటాడతామని వార్నింగ్ ఇచ్చారు. చిత్ర పరిశ్రమలోని అగ్ర హీరోలు, నిర్మాతలు స్పందించి ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుంచి పూర్తిగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇది నయా భారత్ అని, ఇక్కడ హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో అజ్ఞాత వ్యక్తులు చేస్తున్న ఆపరేషన్లను గుర్తుపెట్టుకోవాలని పరోక్షంగా హెచ్చరించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. తనపై వస్తున్న విమర్శలపై ప్రకాశ్ రాజ్ గతంలో స్పందించినప్పటికీ, తాజా వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

బీజేపీలోకి వెళ్తారన్న ప్రచారంపై

## స్పందించిన జీవన్‌రెడ్డి

ప్రాణం ఉన్నంతవరకు కేసీఆర్ వెంటే ఉంటానని అన్నారు. ఆయన నాయకత్వంలో పని చేయడం తనకు గర్వకారణమని అన్నారు. తాను బీజేపీలో చేరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలు, అభిమానులు ఇలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. తాను ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే సైనికుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ కుట్రలు కూలిపోతాయి

బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు ద్వారా కూలింది కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో ఈరోజు గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు అన్నారు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణలో పారుతున్న ప్రతి నీటిబొట్టు కేసీఆర్ చేసిన కృషివల్లే వచ్చిందని అన్నారు. తెలంగాణ భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అందరికీ అసలు విషయం తెలిసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కచ్చితంగా వరప్రదాయిని అన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చయితే రూ.1 లక్ష కోట్లు అని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని, మూడు బ్యారేజీలు అని తెలిపారు. కాంగ్రెస్ చేసిన కుట్రల వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెక్ డ్యాంలు బాంబులు పెట్టి పేలుస్తుంటే కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

## హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ నేతలు క్లీన్ చిట్‌గా భావించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు ఎక్కడా పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును తప్పుబట్టలేదని, దాని నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని మంత్రి గుర్తు చేశారు. మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని, ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న వాస్తవంలో మార్పు లేదని తెలిపారు. హైకోర్టు తీర్పుపై రేపు జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రభుత్వం తన తదుపరి అడుగులను ప్రకటిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

## ఉపాధి అవకాశాలు

పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. శ్రీసిటీ ప్రత్యక్షంగా 70వేల మందికి ఉపాధి కల్పిస్తోందని, మరో లక్షన్నర మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు.

## లైంగిక వేధింపులు నిజమే

చూపించిందని తెలిపారు. అయితే, విద్యార్థినులతో మాట్లాడితే లైంగిక వేధింపులు నిజమేనని నిర్ధరణ అయ్యిందన్నారు.

## మంత్రుల పర్యటన

గవర్నెన్స్, రాజకీయ జవాబుదారీతనంపై ఇవాళ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. మంత్రులు అనిత, నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్య ప్రసాద్, అచ్చెన్నాయుడు, సత్య కుమార్ సింగపూర్ వెళ్లిన వారిలో ఉన్నారు.

## డొనాల్డ్ ట్రంప్ అప్‌డేట్

సమయం ఇస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ అభ్యర్థన మేరకు కాల్పుల విరమణ పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజాగా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## భారత్ తలొగ్గదు

చేశారు. దుఃఖంలో, సంకల్పంలోనూ దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎప్పటికీ సఫలం కావన్నారు. కాగా.. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేశారు. హిందువులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ప్రపంచమంతా తీవ్రంగా ఖండించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల క్యాంపులను నేలమట్టం చేసింది.

## ఖర్గేకు ఈసీ నోటీసులు

చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు కేంద్ర మంత్రులు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే ఎన్నికల సంఘం నుంచి ఈ స్పందన వచ్చింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో గురువారం పోలింగ్ జరగనున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడికి నోటీసులు రావడం గమనార్హం. చెన్నైలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. అన్నాడీఎంకేపై విరుచుకుపడ్డారు. అన్నాదురై ఫొటో పెట్టుకునే అన్నాడీఎంకే నేతలు మోదీతో ఎలా చేతులు కలపగలరు? అని ప్రశ్నించారు. సమానత్వంపై ఆయనకు నమ్మకం లేదంటూ మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇవి దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. క్షమాపణలు చెప్పాలని భాజపా డిమాండ్ చేయగా తన వ్యాఖ్యల్లోని ఉద్దేశంపై ఖర్గే వివరణ ఇచ్చారు. మోదీని ఎప్పుడూ ఉగ్రవాది అనలేదని, దేశ ప్రజాస్వామ్య స్వరూపాన్ని ఆయన టెర్రరైజ్ చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు.

## భారత్ జోలికి వస్తే..

భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే దేశ ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు. "ఇప్పటి వరకు భారత్ చరిత్రను పరిశీలిస్తే కావాలని ఎవరిపైనా దాడి చేయలేదు. పొరుగుదేశాలు భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే ప్రతిస్పందన అదే స్థాయిలో ఉంటుంది" అని పాక్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. పొరుగుదేశాలన్నీ సఖ్యతగానే ఉన్నాయని, సమస్యలను సృష్టించేది ఆ ఒక్కటి మాత్రమేనని పరోక్షంగా పాక్‌పై (ఖుఎుఅఖుఅ) విమర్శలు గుప్పించారు. భారత సైనిక వ్యవస్థ ఇంతకుముందు కంటే దృఢంగా మారిందని, ఆపరేషన్ సిందూర్‌లో ఏం చేసిందో మీకు తెలిసే ఉంటుంది కదా! అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్ తమ పట్ల తప్పుగా వ్యవహరిస్తే కోల్‌కతాపై దాడి చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పహల్గాం దాడి ఘటనకు ఏడాది పూర్తయిన వేళ రక్షణ మంత్రి పాక్‌కు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. 'గతేడాది ఏప్రిల్ 22న పిరికిపందలు చేసిన పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు నా హృదయపూర్వక నివాళులు. వారి కుటుంబ సభ్యుల బాధను మేం ఎల్లప్పుడూ పంచుకుంటాం. జాతికి తగిలిన దెబ్బను ఎప్పటికీ మర్చిపోలేం' అని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## నౌకలపై ఇరాన్ దాడి

ఇరాన్ కాల్పులు జరిపిందని పేర్కొంది. ఈ ఘటనలో సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని, నౌకకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొంది. కంటైనర్ నౌకపై దాడిని ఇరాన్ మీడియా కూడా ధ్రువీకరించింది. టెహ్రాన్‌కు చెందిన వాణిజ్య నౌకను అమెరికా దళాలు ఇటీవల స్వాధీనం చేసుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ దాడి జరగడం ఉద్రిక్తతలను మరోసారి తీవ్రతరం చేసింది.

**అలా చేస్తే.. చర్చలకు సిద్ధం: ఇరాన్**

అమెరికా- ఇరాన్ మధ్య చర్చలపై సందిగ్ధం వీడలేదు. ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో రెండోవిడత చర్చలు జరిపేందుకు సిద్ధమేనని పేర్కొన్నారు. అయితే, హార్ముజ్‌లో తమ నౌకలపై కొనసాగుతోన్న దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని షరతు విధించారు. తమ నౌకలను దిగ్బంధించడంతో.. అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఇరావానీ అన్నారు. దీన్ని ఎత్తివేయాలని తాము అడిగామని.. అందుకు అమెరికా కూడా సిద్ధంగా ఉన్నట్లు తమకు కొన్ని సంకేతాలు కూడా అందాయన్నారు. దిగ్బంధనం తొలగించిన వెంటనే.. ఇస్లామాబాద్‌లో చర్చలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా చర్చలు కాకుండా.. యుద్ధం చేయాలనుకుంటే అందుకు ఇరాన్ కూడా సిద్ధంగా ఉందన్నారు.

## పాక్- హమాస్ మధ్య బలపడిన సంబంధాలు

బృందాలు కూడా పాల్గొన్నట్లు సమాచారం. హమాస్-పాక్‌ల మధ్య పొత్తుల విషయంలో అవి తమ సిద్ధాంతాలను దాటి పరస్పర కార్యాచరణను అమల్లోకి తెచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఈ రెండు బృందాలు ప్రణాళికలను అమలుచేయడానికి ప్రాంతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటున్నాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దీంతో దర్యాప్తు ఏజెన్సీలు నిఘా బృందాల్ని అప్రమత్తం చేశాయి. అయినా నూతన పరిణామాలు భద్రతా వర్గాల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

## సర్వం సిద్ధం..

చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతాని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు.

**పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాల్లో..**

పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్.. ఎన్‌ఆర్‌ఐల కలల గమ్యం..

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం స్వర్ణయుగాన్ని ఆస్వాదిస్తోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాలను వెనక్కి నెట్టి పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. ముఖ్యంగా ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) పెట్టుబడుల ప్రవాహం పెరగడంతో నగరం అంతర్జాతీయ స్థాయి లగ్జరీ హౌసింగ్ హబ్‌గా అవతరించింది. తాజా విశ్లేషణల ప్రకారం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో ఎన్ఆర్ఐల వాటా 20 శాతం మార్కును చేరుకోవడం విశేషం. గత ఐదేళ్లుగా హైదరాబాద్ మహానగరం రూపురేఖలు వేగంగా మారిపోయాయి. కేవలం ఐటీ రంగమే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో నగరం అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంటోంది. ఈ క్రమంలోనే అమెరికా, యూకే, కెనడా, గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు తమ సొంత గడ్డపై పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.

**పశ్చిమ హైదరాబాద్.. లగ్జరీకి కేరాఫ్ అడ్రస్**

నగర పశ్చిమ భాగం ఇప్పుడు లగ్జరీ రియల్ ఎస్టేట్‌కు చిరునామాగా మారింది. ముఖ్యంగా కోకాపేట్, మోకిల, శంకర్‌పల్లి, తెల్లాపూర్ వంటి ప్రాంతాలు విల్లా ప్రాజెక్టులతో కళకళలాడుతున్నాయి. ఇక్కడ జరుగుతున్న మెగా డెవలప్‌మెంట్స్ నగరాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టాయి. ఔటర్ రింగ్ రోడ్ విమానాశ్రయానికి గంటలోపే చేరుకునే సౌకర్యం, ట్రాఫిక్ రహిత ప్రయాణం ఎన్ఆర్ఐలను ఈ ప్రాంతాల వైపు ఆకర్షిస్తోంది.

**ధరలు పెరిగినా తగ్గని క్రేజ్**

ఒకప్పుడు రూ.2 కోట్లు అంటేనే లగ్జరీగా భావించే వారు. కానీ

## లగ్జరీ విల్లాలకు పెరిగిన డిమాండ్



నేడు హైదరాబాద్ శివార్లలో విల్లాల ధరలు రూ.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు పలుకుతున్నాయి. ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఉండే స్థల సమస్య ఇక్కడ లేకపోవడం, విశాలమైన స్థలంలో అంతర్జాతీయ స్థాయి క్లబ్‌హౌస్‌లు, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్, అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో ప్రాజెక్టులు నిర్మితమవుతుండటం ఇన్వెస్టర్లకు సానుకూల అంశంగా మారింది.

**ఎన్ఆర్ఐ పెట్టుబడులకు బలాన్నిస్తున్న అంశాలు**

ప్రవాస భారతీయులు ఇంత భారీగా పెట్టుబడులు పెట్టడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం వల్ల, విదేశీ కరెన్సీని భారత్‌లో పెట్టుబడిగా మార్చినప్పుడు ఎన్ఆర్ఐలకు అధిక ప్రయోజనం చేకూరుతోంది. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సంఖ్య పెరగడం, జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రీమియం ప్రాపర్టీలకు భారీగా అద్దెలు లభిస్తున్నాయి. ఇది పెట్టుబడిపై స్థిరమైన ఆదాయాన్ని హామీ ఇస్తోంది. రీజినల్ రింగ్ రోడ్ , ఫార్మా సిటీ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టుల వల్ల ఆస్తుల విలువ భవిష్యత్తులో రెట్టింపు అవుతుందనే అంచనా ఉంది.

**ప్రభుత్వ సహకారం..పారదర్శకత**

తెలంగాణ ప్రభుత్వ సరళీకృత విధానాలు, టీఎస్ బీపాస్ వంటి అనుమతుల ప్రక్రియ, రెరా అమలు వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత పెరిగింది. ఇది ఎన్ఆర్ఐలలో ఉన్న సంశయాలను తొలగించి, నమ్మకమైన పెట్టుబడులకు బాటలు వేసింది. గతంలో కేవలం ఖాళీ ప్లాట్లపై ఆసక్తి చూపిన వారు ఇప్పుడు 'గేటెడ్ కమ్యూనిటీ' విల్లాల్లో నివసించేందుకు మొగ్గు చూపుతున్నారు. మొత్తానికి హైదరాబాద్ కేవలం ఒక నగరంలా కాకుండా ఒక గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా రూపాంతరం చెందింది. లగ్జరీ హౌసింగ్ విభాగంలో వస్తున్న ఈ ఊపు కేవలం తాత్కాలికం కాదని, రాబోయే దశాబ్ద కాలం పాటు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అటు జీవన ప్రమాణాలు, ఇటు పెట్టుబడిపై రాబడి.. రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్న హైదరాబాద్, ఇప్పుడు ఎన్ఆర్ఐల మొదటి ఎంపికగా నిలుస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## హైదరాబాద్ లో కేవలం పావువంతు కంటే
# తక్కువ జనానికి సొంత ఇల్లు..

భాగ్యనగరంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరి కల 'సొంత ఇల్లు'. కానీ తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించిన ఈ గణాంకాలు చూస్తుంటే, ఆ కల సామాన్యుడికి ఎంతటి 'అందని ద్రాక్ష'గా మారిందో అర్థం అవుతోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ప్రపంచ పటంలో ఐటీ, ఫార్మా హబ్‌గా వెలుగొందుతోంది. అయితే, ఈ నగరం వెనుక మరో చేదు నిజం దాగుంది. ఇక్కడ నివసించే ప్రతి నలుగురిలో ముగ్గురికి సొంత ఇల్లు లేదు. తాజాగా వెలువడిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం, హైదరాబాద్‌లో కేవలం 23.08 శాతం కుటుంబాలకు మాత్రమే సొంత ఇళ్లు ఉన్నాయి. అంటే నగరంలోని మెజారిటీ జనాభా తమ సంపాదనలో సింహభాగాన్ని ప్రతి నెలా అద్దెల రూపంలోనే ఖర్చు చేస్తోంది.

**శివారు జిల్లాల్లోనూ ఇదే సెగ!**

హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న కొద్దీ శివారు జిల్లాలైన మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటోంది. కానీ, అక్కడ కూడా గృహ యాజమాన్యం ఆశాజనకంగా లేదు. ఇక్కడ సొంత ఇల్లు ఉన్నవారు కేవలం 35.26 శాతమే. ఈ జిల్లాలో 35.56 శాతం మందికి మాత్రమే సొంత గూడు ఉంది. ఐటీ కారిడార్, అంతర్జాతీయ కంపెనీలు ఈ జిల్లాల్లోనే ఉన్నప్పటికీ, పెరిగిన భూముల ధరలు సామాన్యుడిని అద్దె ఇళ్లకే పరిమితం చేస్తున్నాయి.

**నారాయణపేట టాప్!**

నగరాలకు భిన్నంగా గ్రామీణ జిల్లాల్లో సొంత ఇంటి శాతం గణనీయంగా ఉంది. నారాయణపేటలో 68.88 శాతంతో ఈ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దక్షిణ తెలంగాణ జిల్లాలైన వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 65 శాతం మందికి సొంత ఇళ్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో భూమి లభ్యత ఎక్కువగా ఉండడం, వంశపారంపర్యంగా వచ్చే ఇళ్లు ఉండడం వల్ల అక్కడ గృహ యాజమాన్యం ఎక్కువగా కనిపిస్తోంది.

**సొంత ఇల్లు ఎందుకు అందని ద్రాక్ష..?**

హైదరాబాద్‌లో గృహ యాజమాన్యం తక్కువగా ఉండేందుకు ప్రధాన కారణాలు.. ఐదేళ్లలో హైదరాబాద్‌లో స్థిరాస్తి ధరలు రెట్టింపయ్యాయి. ఒక సాధారణ మధ్య తరగతి ఉద్యోగి తన జీవితకాల సంపాదనతో నగరంలో ప్లాట్ లేదా ఫ్లాట్ కొనడం కష్టంగా మారింది. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వారు స్థిరపడడం కంటే అద్దె ఇళ్లలోనే ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు. నగరంలో ఇళ్లు ఉన్నవారు కూడా వాటిని నివాసం కోసం కాకుండా, కేవలం పెట్టుబడి కోసం కొని అద్దె కడుతున్నారు. దీనివల్ల ఒకరికే నాలుగైదు ఇళ్లు ఉండగా, వేల మందికి ఒక్కటి కూడా లేని పరిస్థితి ఏర్పడింది.

**ప్రభుత్వం ముందున్న సవాలు**

ఈ నివేదిక ప్రభుత్వానికి ఒక స్పష్టమైన హెచ్చరిక చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాల కోసం ప్రభుత్వం 'అఫోర్డబుల్ హౌసింగ్' పథకాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. నగరం వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరిస్తే, జనం దూరం వెళ్లైనా సొంత ఇళ్లు కొనుక్కునే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు 'సొంత ఇల్లు' అనేది ప్రతి కుటుంబానికి ఒక ప్రాథమిక అవసరం. కానీ నేడు హైదరాబాద్ వంటి నగరాల్లో అది ఒక లగ్జరీగా మారిపోయింది. 77 శాతం మంది అద్దె ఇళ్లలో ఉండడం అనేది ఆర్థిక అసమానతలకు అద్దం పడుతోంది.



ప్రభుత్వం కేవలం ధనికుల కోసమే కాకుండా, సామాన్యుల సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా విధానాలు రూపొందించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# కేసీఆర్, హరీశ్‌రావులకు హైకోర్టులో ఊరట



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు ఊరట కల్పించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలూ పాటించలేదని కోర్టు పేర్కొంది. నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆదేశించింది. బ్యారేజీల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె.జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. నేడు తీర్పును వెలువరించింది. కేసీఆర్, హరీశ్‌రావుతోపాటు స్మితా సబర్వాల్, ఎస్.కె.జోషిలకు కూడా కోర్టు ఊరట కల్పించింది.

# ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలి : మంత్రి పొన్నం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ పరిరక్షణ, ప్రజాశ్రేయస్సు కోసం సమ్మె విరమించాలని కోరారు. సమస్యకు సమ్మె పరిష్కారం కాదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి కమిటీ వేసినట్లు తెలిపారు. నాలుగు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు. 32 అంశాల్లో 29 వెంటనే పరిష్కారం చేయదగినవని.. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికల అంశాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాలపై సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామన్నారు.

# ఈ నెల 25న కవిత 'కొత్త పార్టీ' ఆవిర్భావ సభ



**మేడ్చల్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ప్రకటన సందర్భంగా ఏప్రిల్ 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో 50 వేల మందితో ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తెలిపారు. సభ జరగనున్న మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో బుధవారం ఆయన జాగృతి నాయకులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ జాగృతి.. కవిత నేతృత్వంలో కొత్త రాజకీయ శక్తిగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళ పిడికిలి నుంచి కొత్త పార్టీ పురుడు పోసుకోబోతోందని, పార్టీని ఆదరించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని చెప్పారు. అన్ని జిల్లాల నుంచి కవిత మద్దతుదారులు పెద్దఎత్తున సభకు హాజరుకాబోతున్నారని తెలిపారు. 20 ఏళ్లలో కవితతో కలిసి పనిచేసిన వాళ్లు, ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండి ఉద్యమ ప్రయోజనాలు నెరవేరలేదని భావిస్తున్న వేలాది మంది ఉద్యమకారులు, ఎన్జీవోలతోపాటు నిపుణులను సభకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

**ఉదయం 10 గంటలకు ముహూర్తం**

ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 10 గంటలకు పార్టీ ప్రకటన ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. వయోవృద్ధులు సభకు హాజరుకావొద్దని సూచించారు. సభకు హాజరయ్యే వారి కోసం తెలంగాణ వంటకాలను సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్‌రెడ్డి, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.



## 'నేను ఆరోగ్యంగానే ఉన్నాను..
# ఆందోళన వద్దు'
## పటాన్‌చెరు ఎమ్మెల్యే

**సంగారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'నేను ఆరోగ్యంగానే ఉన్నాను. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు..." లని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కాలుజారి పడటంతో స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం.. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భగవంతుడి కృప, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అభిమానంతో త్వరలోనే కోలుకొని తిరిగి ప్రజాసేవలోకి వస్తానని ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను
# హైకోర్టు తప్పు పట్టలేదు
## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనేది వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను గానీ, సంబంధిత నివేదికను గానీ, దర్యాప్తు తీరునుగానీ హైకోర్టు తప్పుపట్టలేదని, కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ నివేదికను కూడా తప్పుపట్టలేదని అన్నారు. విధానపరమైన నిర్ణయాన్ని మాత్రమే తప్పుపట్టిందన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందనేది వాస్తవని చెప్పారు. "కాళేశ్వరం దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లటం ఖాయం. హైకోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తదుపరి చర్యలకు వెళ్తుంది. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని భాజపా నేతలు అనలేదా? బీఆర్‌ఎస్ నేతలకు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని మోదీ, అమిత్ షా గతంలో ఆరోపించారు. సీబీఐకి అప్పగిస్తే రెండ్రోజుల్లోనే దోషులను జైల్లో పెడతామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. సీబీఐ దర్యాప్తు కోరితే కేంద్రం చర్యలు తీసుకోలేదు. మరి సీబీఐ దర్యాప్తు ఎందుకు ప్రారంభం కాలేదో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి" అని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టుకు ప్రభుత్వం?**

కాళేశ్వరం అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర మంత్రివర్గం గురువారం భేటీ కానుంది. హైకోర్టు తీర్పుపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

## కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు..
# చివరకు న్యాయమే గెలిచింది
## హైకోర్టు తీర్పుపై హరీశ్ రావు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. "ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయస్థానాల్లో న్యాయమే గెలుస్తుందని, సత్యమే నిలుస్తుందని మరోసారి రుజువైంది" అని ఆయన అన్నారు. కేసీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు మాజీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరించి జరిపిన విచారణను హైకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వివరించారు. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాటకాలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ బురదజల్లుడు ఆపి, దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 2025 జులై 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, కేసీఆర్, హరీశ్ రావులను బాధ్యులుగా పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఒక్కసారి సాగుతో డబుల్ లాభం.. కిసాన్ వాయిస్ తక్కువ పెట్టుబడి.. భారీ ఆదాయం..

## గింజలు లేని టమాటాలు ఇప్పుడు మన దగ్గరే ఉత్పత్తి



బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఒక పెద్ద బహుమతిని అందించింది. విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన కొత్త విత్తన రహిత టమోటా రకం ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉంది. అత్యంత ఎక్కువ డిమాండ్, రోజూ వంటల్లో ఉపయోగించే కూరగాయ ఏది అంటే టక్కున చెప్పే పేరు టమాట. దేశీయ మార్కెట్లో సాధారణ టమోటా కంటే గింజలు లేని వాటినే ఎక్కువగా ఇష్టపడతారు. ఎందుకంటే వినియోగదారులు వీటిని కట్ చేసుకోవడం సులభం కాబట్టి. అందుకే ప్రాసెసింగ్ పరిశ్రమలో దీని ఉపయోగం ఎక్కువగా ఉండటం వల్ల వాటిని సాగు చేస్తున్నారు. ఈ విత్తన రహిత టమోటా రకం మరొక ప్రధాన లక్షణం దాని ఎక్కువ కాలం నిల్వ ఉండటం. ఇది రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉందని నిరూపించబడుతోంది. సాధారణంగా టమోటాలు త్వరగా చెడిపోతాయి. దీని కారణంగా రైతులు తక్కువ ధరకు పంటను అమ్మవలసి వస్తుంది. కానీ దీూఖ అభివృద్ధి చేసిన ఈ కొత్త రకాన్ని 8 నుండి 10 రోజుల వరకు సులభంగా సురక్షితంగా ఉంచవచ్చు. ఇది మార్కెట్ పరిస్థితి ,దాని ధరను పరిగణనలోకి తీసుకుంటే రైతులకు సరైన సమయంలో తమ పంటను విక్రయించే అవకాశాన్ని ఇస్తుంది. అందుకే రైతులు ఇప్పుడు ఈ టమోటాను రెట్టింపు లాభదాయక టమోటా అని పిలుస్తున్నారు. ఈ రకం ధర పరంగా కూడా రైతులకు ఉపశమనం కలిగించింది. సాధారణ టమోటాల ధర ఎల్లప్పుడూ హెచ్చుతగ్గులకు లోనవుతుండగా, ఈ విత్తన రహిత టమోటాలు ఇతర రకాల కంటే ఎక్కువ ధరలకు అమ్ముడవుతున్నాయి. రాబోయే కాలంలో ప్రాసెసింగ్ యూనిట్లు, సాస్ , కెచప్ తయారీ కంపెనీలు అలాగే సూపర్ మార్కెట్ గొలుసులలో దీని డిమాండ్ పెరుగుతుందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దీనికి విత్తనాలు లేనందున, ప్రాసెసింగ్ సులభం అవుతుంది. దీని వల్ల రైతులకు మంచి ధరలు లభిస్తాయి. అనేక జిల్లాల్లో దీని ప్రయోగాత్మక సాగు ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి.

BAU శాస్త్రవేత్తల ప్రకారం విత్తన రహిత టమోటా రకం వేడి , తేలికపాటి చలి కాలంలో మంచి దిగుబడిని ఇవ్వగలదు. దీని మొక్కలు బలంగా ఉంటాయి. అధిక వ్యాధి నిరోధకతను కలిగి ఉంటాయి. 45 నుండి 60 రోజుల మొక్కలను సాగు కోసం నాటడానికి మంచివిగా భావిస్తారు. సరైన నీటిపారుదల, సమతుల్య ఎరువులు, సాధారణ పర్యవేక్షణతో, రైతులు ఎకరానికి మంచి ఉత్పత్తిని పొందవచ్చు.

## రైతులను ఆకర్షిస్తున్న పొట్టేళ్ల పెంపకం..!



వ్యవసాయ రంగంలో సంప్రదాయ, వాణిజ్య పంటలతో పాటు పాడిపరిశ్రమ, పశుపోషణ వైపు రైతుల ఆసక్తి వేగంగా పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం పొందాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు పొట్టేళ్ల పెంపకం లాభదాయకమైన వ్యాపారంగా మారుతోంది. పాడి పరిశ్రమ తర్వాత అత్యంత లాభాలు ఇచ్చే రంగంగా గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం రైతులను ఆకర్షిస్తోంది. సీజన్‌తో సంబంధం లేకుండా పొట్టేళ్ల మాంసానికి ఏడాది పొడవునా డిమాండ్ ఉండటం ఈ వ్యాపారానికి ప్రధాన బలంగా మారింది. పెద్ద ఫార్మ్‌లే కాదు, ఊర్లలోనే తక్కువ స్థలంలో షెడ్ ఏర్పాటు చేసుకుని లక్షల రూపాయల ఆదాయం పొందుతున్న రైతులు ఇప్పుడు ఎంతోమంది కనిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహజంగానే మేత లభించడం వల్ల ఆహార ఖర్చు తగ్గి లాభాలు మరింత పెరుగుతున్నాయి. వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలో కొల్లాపూర్ వెళ్లే రహదారిపై వనపర్తికి చెందిన శ్యామ్ సుందర్ ఇదే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పొట్టేళ్ల పెంపకాన్ని వ్యాపారంగా మలుచుకుని మంచి ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన వద్ద దాదాపు 150 పొట్టేళ్లు ఉండగా, వాటిని జాగ్రత్తగా సంరక్షిస్తూ సమయానికి ఆహారం, నీరు అందిస్తున్నట్లు తెలిపారు. సరైన బరువు వచ్చిన తర్వాత లైవ్ వెయిట్‌కు కిలో రూ.440 చొప్పున విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నట్లు చెప్పారు. పొట్టేళ్ల పెంపకాన్ని ప్రారంభించేవారు ముందుగా సరైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని శ్యామ్ సుందర్ సూచిస్తున్నారు. చిత్తడిగా కాకుండా పొడిగా ఉండే ప్రదేశంలో షెడ్ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యం. నీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ప్రారంభంలో కొంత పెట్టుబడి అవసరమైనా, కాలక్రమేణా లాభాలు భారీగా వస్తాయని ఆయన అనుభవంతో చెబుతున్నారు. గొర్రెల పెంపకంలో సరైన మెళకువలు పాటిస్తే తక్కువ కాలంలోనే ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి 30 గొర్రెలకు కనీసం రెండు మగ గొర్రెలను ఉంచడం మంచిదని, సంతానోత్పత్తిలో సమస్యలు ఉన్న గొర్రెలను మంద నుంచి తొలగించాలన్నారు. వ్యాధులు రాకుండా సమయానికి వ్యాక్సిన్లు వేయించడం, వైద్యుల సలహాలు తీసుకోవడం చాలా అవసరమని సూచించారు. నాణ్యమైన రకమైన గొర్రెలను కొనుగోలు చేయడం, సరైన సంరక్షణ తీసుకోవడం ద్వారా పొట్టేళ్ల పెంపకాన్ని లాభదాయక వ్యాపారంగా మార్చుకోవచ్చని శ్యామ్ సుందర్ తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడే రైతులకు ఇది స్థిరమైన ఆదాయ మార్గంగా మారుతుందని, కష్టపడితే ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



# ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్..

## విష్ణు ప్రియ, అనన్య బాటలో మరో బిగ్ బాస్ బ్యూటీ.. వీడియో వైరల్

మొన్న విష్ణు ప్రియ.. నిన్న అనన్య నాగళ్ల.. ఇప్పుడు మరో బిగ్ బాస్ బ్యూటీ ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ చేసుకోవాలంటూ ఓ వీడియోను రిలీజ్ చేసింది. ఈ మేరకు ఆమె షేర్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట బాగా వైరలవుతోంది. ఇటీవల కాలంలో ఇన్ స్టా గ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ అంటూ సెలబ్రిటీలు తెగ హంగామా చేస్తున్నారు. ఎక్స్ క్లూజివ్ కంటెంట్ అంటూ గ్లామరస్ ఫొటోస్, వీడియోలను షేర్ చేస్తూ భారీ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇటీవల విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల ఈ జాబితాలో చేరారు. తాజాగా మరో బిగ్ బాస్ బ్యూటీ అషూ రెడ్డి కూడా ఈ లిస్ట్ లో చేరిందని తెలుస్తోంది. 'అందరూ సబ్ స్క్రైబ్ చేసుకోండి.. ఎక్స్‌క్లూజివ్ కంటెంట్.. వీడియోలు' అని నవ్వుతూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. అయితే అషూ రెడ్డి నిజంగానే ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ ప్రారంభించారా లేదా అనేది తెలియాల్సి ఉంది. టిక్ టాక్ వీడియోలతో కెరీర్ ప్రారంభించిన అషూ రెడ్డి బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోతోనూ బాగా పాపులర్ అయ్యింది. అలాగే సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మతో తీసిన బోల్డ్ ఇంటర్వ్యూ తో కూడా బాగా వైరల్ అయ్యింది. ఆ మధ్యన కొన్ని సినిమాల్లోనూ నటించిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం పలు టీవీ ప్రోగ్రామ్స్ తో బిజీ బిజీగా ఉంటోంది. ఇక అషూరెడ్డికి సోషల్ మీడియాలోనూ భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్ స్టా గ్రామ్ లో ఫుల్ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలన్నింటినీ ఇందులో షేర్ చేస్తుంటుంది. అలాగే గ్లామరస్ ఫొటోస్, వీడియోలను కూడా షేర్ చేస్తుంటుంది. వీటికి నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వస్తుంటాయి. ఒక వేళ ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ కనుక పెడితే భారీ స్థాయిలో ఫాలోవర్లు పెరుగుతారని అభిమానులు భావిస్తున్నారు. ఎందుకంటే విష్ణు ప్రియ విషయానికి వస్తే.. ఈ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ కు ముందు ఆమెకు చాలా తక్కువ మంది సబ్ స్క్రైబర్లు ఉండే వారు. ఎప్పుడైతే కేసు నమోదు అయ్యిందే ఒక్కసారిగా అషూరెడ్డి సబ్ స్క్రైబర్ల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఇప్పుడు అషూ రెడ్డి విషయంలోనూ ఇదే జరుగుతుందని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఇప్పుడు ఇన్ స్టా గ్రామ్ న్ స్టా గ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

### ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్..

# అయినా అద్దె ఇంట్లోనే ఉంటున్న బ్యూటీ..



సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో ఈ హీరోయిన్ క్రేజ్ మాములుగా ఉండదు. సినిమాలతో పాటు నెట్టింట కూడా అభిమానులను అలరిస్తూ రచ్చ చేస్తుంటుంది ఈ ముద్దుగుమ్మ. సినిమాల్లో విభిన్నమైన పాత్రలు చేయడమే కాదు. సోషల్ మీడియాలో రకరకాల ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో ఈ హీరోయిన్ క్రేజ్ మాములుగా ఉండదు. సినిమాలతో పాటు నెట్టింట కూడా అభిమానులను అలరిస్తూ రచ్చ చేస్తుంటుంది ఈ ముద్దుగుమ్మ. సినిమాల్లో విభిన్నమైన పాత్రలు చేయడమే కాదు. సోషల్ మీడియాలో రకరకాల ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అందరికంటే ఈ అమ్మడు కాస్త డిఫరెంట్ అనే చెప్పాలి. తెలుగులో ఈ అమ్మడు చేసింది కొన్ని సినిమాలే అయినా విపరీతమైన ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఆమె ఎవరో కాదు ముద్దుగుమ్మ అదా శర్మ. హీరోయిన్ అదాశర్మ. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, నితిన్ కాంబోలో వచ్చిన హార్ట్ ఎటాక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అందాల భామ. ఈ మూవీ డిజాస్టర్ అయినప్పటికీ యూత్ హార్ట్స్ దొచేసింది ఆదా శర్మ. ఫస్ట్ మూవీతోనే యూత్ లో క్రేజ్ సొంతం చేసుకున్న ఈ వయ్యారికి వరుస ఆఫర్స్ వస్తాయనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన అదా.. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. ఆ తర్వాత అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. అక్కడే ది కేరళ స్టోరీ అనే సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. కానీ విడుదలకు ముందే ఈ మూవీ వివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ ఇండస్ట్రీలోనూ అదాకు అంతగా ఆఫర్స్ రాలేదు. హిందీలో ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది అదా శర్మ. ప్రస్తుతం సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్న అదా శర్మ.. ఇప్పుడు ఇన్ స్టాలో సందడి చేస్తుంది. ఇదిలా ఉంటే ఈ చిన్నది దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఎక్కడైతే సుశాంత్ సూసైడ్ చేసుకొని చనిపోయాడో అదే ఫ్లాట్ లో ఆమె అద్దెకు దిగింది. నెలనెలా రెంట్ పే చేస్తుంది అదా శర్మ. ఈ విషయాన్నీ ఆమె ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. అలాగే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది ఈ ముద్దుగుమ్మ.

# షమీ, మోహ్సిన్ ధాటికి రాజస్థాన్ విలవిల..

## లక్నో ముందు స్వల్ప లక్ష్యం



లక్నో బౌలర్ల ధాటికి రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులకే పరిమితమైంది. షమీ, మోహ్సిన్ చెలరేగగా, జడేజా ఆఖర్లో 43 పరుగులతో ఆదుకున్నాడు. లక్నో విజయం సాధించాలంటే 120 బంతుల్లో 160 పరుగులు చేయాల్సి ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ 32వ పోరులో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, అతని నిర్ణయం సరైనదేనని లక్నో బౌలర్లు నిరూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల నష్టానికి కేవలం 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్నో విజయం సాధించాలంటే 120 బంతుల్లో 160 పరుగులు చేయాల్సి ఉంది. రాజస్థాన్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (22) దూకుడుగా ఆడే క్రమంలో మహమ్మద్ షమీ బౌలింగ్‌లో వెనుదిరగగా, యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (8) మోహ్సిన్ ఖాన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఇక వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ డకౌట్ కావడంతో పవర్‌ప్లే ముగిసేసరికే రాజస్థాన్ 44 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (20), షిమ్రాన్ హెట్మైయర్ (22) కొద్దిసేపు క్రీజులో నిలబడటానికి ప్రయత్నించినా, లక్నో బౌలర్లు ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ వరుస వికెట్లతో వారిని దెబ్బకొట్టారు. ఇన్నింగ్స్ మధ్యలో ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. 11వ ఓవర్లో కీపింగ్ చేస్తున్న లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ముఖానికి బంతి బలంగా తగలడంతో అతని ముక్కుకు గాయమైంది. దీనివల్ల కొద్దిసేపు ఆట నిలిచిపోయింది. అయితే ట్రీట్‌మెంట్ తర్వాత పంత్ మళ్ళీ కీపింగ్ కొనసాగించాడు. రాజస్థాన్ స్కోరు 100 దాటడానికే 15 ఓవర్లు పట్టిందంటే లక్నో బౌలర్ల ఆధిపత్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివర్లో రవీంద్ర జడేజా (29 బంతుల్లో 43రి) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. అతనికి తోడుగా శుభమ్ దూబే (19రి) నిలబడటంతో రాజస్థాన్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ముఖ్యంగా ఇన్నింగ్స్ చివరి బంతికి జడేజా కొట్టిన సిక్సర్ రాజస్థాన్ స్కోరును 159కి చేర్చింది. లక్నో బౌలర్లలో షమీ, మోహ్సిన్ ఖాన్, ప్రిన్స్ యాదవ్ తలో రెండు వికెట్లు తీసి రాజస్థాన్‌ను కట్టడి చేశారు. స్లో పిచ్‌పై 160 పరుగుల లక్ష్యం లక్నోకు అంత సులభం కాకపోవచ్చు, ఎందుకంటే రాజస్థాన్ వద్ద క్వాలిటీ స్పిన్నర్లు ఉన్నారు.

# పంత్ భయ్యా.. ఇదేం బ్యాటింగ్?

## పట్టుమని 160 రన్స్ కూడా చేయలేక చేతులెత్తేసిన లక్నో



లక్నో ఇన్నింగ్స్ ఆరంభం నుంచే వికెట్ల పతనం మొదలైంది. ఓపెనర్ ఆయుష్ బదోని మొదటి ఓవర్లోనే రనౌట్ కావడంతో లక్నో షాక్‌కు గురైంది. ఆ వెంటనే కెప్టెన్ రిషబ్ పంత్, స్టార్ బ్యాటర్ ఐడెన్ మార్క్రమ్ ఇద్దరూ సున్నా చుట్టేసి పెవిలియన్ చేరారు. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన 32వ పోరులో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ లో-స్కోరింగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను వారి సొంత గడ్డపైనే చిత్తు చేసి, రాజస్థాన్ తన విజయ పరంపరను మళ్లీ మొదలుపెట్టింది. ఐపీఎల్ 2026 సీజన్ 32వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి తమ జట్టుకు 40 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (43రి) ఆఖర్లో కీలక ఇన్నింగ్స్ ఆడటంతో రాజస్థాన్ గౌరవప్రదమైన స్కోరును బోర్డుపై ఉంచగలిగింది. లక్నో బౌలర్లలో షమీ, మోహ్సిన్ ఖాన్ చెరో రెండు వికెట్లు తీశారు. అయితే, 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ఏ దశలోనూ రాజస్థాన్ బౌలర్లను ఎదిరించలేకపోయారు. ముఖ్యంగా పవర్‌ప్లేలోనే లక్నో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ ఆయుష్ బదోని మొదటి ఓవర్లోనే రనౌట్ కాగా, ఆ వెంటనే కెప్టెన్ రిషబ్ పంత్, స్టార్ బ్యాటర్ ఐడెన్ మార్క్రమ్ ఇద్దరూ సున్నా పరుగులకే వెనుదిరిగారు. ఈ ముగ్గురు కీలక ఆటగాళ్లు డకౌట్ అవ్వడం లక్నో ఓటమిని ముందే ఖరారు చేసింది. నికోలస్ పూరన్ (22), హిమ్మత్ సింగ్ (15) కొద్దిసేపు నిలబడే ప్రయత్నం చేసినా రాజస్థాన్ బౌలర్లు వారిని క్రీజులో పాతుకుపోనివ్వలేదు. మరోవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ మిచెల్ మార్ష్ ఒక్కడే లక్నో తరఫున పోరాటం చేశాడు. కేవలం 39 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసి జట్టును గెలిపిస్తాడని ఆశలు రేపాడు. కానీ, 16వ ఓవర్లో జోఫ్రా ఆర్చర్ వేసిన అద్భుతమైన బంతికి మార్ష్ (55) అవుట్ కావడంతో లక్నో ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో బ్రిజేష్ శర్మ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి లక్నోను 119 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. రాజస్థాన్ బౌలింగ్ విభాగంలో ఆర్చర్, బర్గర్, బిష్ణోయ్, జడేజా అంతా కలిసి కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్నో నవాబులను కట్టడి చేశారు. వరుసగా మూడు ఓటములతో సతమతమవుతున్న లక్నోకు ఈ పరాజయం మరింత ఆవేదన కలిగించగా, వరుసగా రెండు ఓటముల తర్వాత రాజస్థాన్ మళ్ళీ విజయాల బాట పట్టి పాయింట్ల పట్టికలో టాప్-3 స్థానాన్ని మరింత పదిలపరుచుకుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

Published and Edited by Khandavelli Sunilkumar on behalf of Viswam Voice. Published from H.No. 8, 3-430/1/20, Near BSNL Office, Ameerpet, Ali Nagar, Yella Reddy Guda, Hyderabad, Telangana - 500016. Printed at Sri Sai Ganga Printers and Publications, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh - 523001.Registration No: TGTEL/26/A1458